## క్లుప్తంగా

### బాబా మందిరంలో పారాయణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీ షిర్డీసాయిబాబా మందిరంలో ఆదివారం లోక కల్యాణార్థం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో పారాయణ మండలి సభ్యులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పారాయణం చేశారు. తొలుత బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగాశ్రీవిష్ణు సహస్రనామ పారాయణ విశిష్టతను పారాయణ మండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరి వివరించారు.

### దంత సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): దంత సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని దంత వైద్యులు సీహెచ్ ప్రణీత్, అమలేష్ చెప్పారు. స్థానిక షిలో హౌ ప్రేయర్ హాల్‌లో ఐకాన్ డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు దంత సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. నోటి దుర్వాసన, చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి సమస్యలను గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రతి రోజూ రెండు సార్లు దంతాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. చిన్న పిల్లలు జంక్ ఫుడ్స్ తినకుండా తల్లిదండ్రులు చూసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తినాలని చెప్పారు. 45 మంది రోగుల దంతాలను పరిశీలించి మందులను ఉచితంగా అందజేశారు.

### 8న మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సెంటినీ హాస్పిటల్స్ సహకారంతో రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయభాస్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో థైరాయిడ్, ఎముకలు, కీళ్ల వ్యాధులు, మధుమేహం వంటి నిర్ధారణ పరీక్షలను వైద్యులు నిర్వహిస్తారన్నారు. మహిళల ఆరోగ్యం – కుటుంబానికి ఆధారం అనే నినాదంతో అవగాహన సదస్సు చేపట్టామని చెప్పారు. అశోక్‌నగర్‌లోని సోమనాథ్ హాస్పిటల్‌లో నిర్వహించే ఈ శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో వైద్య పరీక్షలకు 98498 72499 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

### అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్: స్వరలయ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం మల్లెలు పూసే వెన్నలకాసే పేరుతో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. హైదరాబాద్, నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు. సీనియర్ గాయకుడు వైఎస్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్.లలిత, వీణ, గంటిశైలజ, మల్లేశ్వరి, స్వరకల్యాణి, రాధాకారాణి, భారతి, శివరామకృష్ణ, రవీంద్రనాథ్ ఆచార్య, కృష్ణమోహన్, అవినాష్‌లు చిత్రగీతాలను ఆలపించారు. వ్యాఖ్యాతగా గాయకుడు ప్రభాకర్ వ్యవహరించారు.

### అన్నసంతర్పణ సమితి శాశ్వత వంటశాలకు శంకుస్థాపన



పాయకాపురం(విజయవాడరూరల్): గత నాలుగు సంవత్సరాలుగా ఎంతోమంది ఆకలి తీర్చిన అన్నసంతర్పణ సమితి శాశ్వత వంటశాల, సమావేశ మందిర నిర్మాణానికి నున్న రోడ్డు డీ మార్ట్ సమీపంలో ఆదివారం ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథులుగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేద, పేదల కడుపు నింపుతున్న అన్న సంతర్పణ సమితి మరింత మందికి ఉచిత భోజనం అందించుటకు శాశ్వత వంటశాల, వృత్తి విద్యలు నేర్పించుటకు సమావేశ మందిరం ఉపయోగపడతాయన్నారు. అన్న సంతర్పణ సమితికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అన్నసంతర్పణ సమితి అధ్యక్షుడు గుండు దిలీప్ మాట్లాడుతూ సమితి సభ్యులు, దాతల సహకారంతో సమితి సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. తమకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

# జాగా కనిపిస్తే.. పాగా

- మురుగు కాలువలను వదలటం లేదు
- వ్యాపారాల పేరిట ఆక్రమణలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- కుంచించుకుపోతున్న రోడ్లు



అయోధ్యనగర్ రాజరాజేశ్వరిపేట బుడమేరు కట్ట రోడ్డులోని పచ్చ దుకాణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో రోజు రోజుకు ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. వ్యాపారాల పేరిట జాగా కనిపిస్తే పాగా వేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తుండటంతో రోడ్లు కుంచించుకుపోతున్నాయి. ముఖ్యంగా మధురానగర్ రాగం మస్తాన్‌రావు రోడ్డు, అయోధ్యనగర్ నుంచి రాజరాజేశ్వరిపేట రోడ్డు, మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డు తదితర ప్రాంతాలలో రహదారులపై బడ్డీలు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. కొంత మంది తమ ఇంటి ముందు రోడ్డుపై బడ్డీలు ఏర్పాటు చేసి మరీ అద్దెలు వసూలు చేయటం గమనార్హం. రోడ్డుపై బడ్డీలు ఏర్పాటు చేయటం బడ్డీల వద్దకు వచ్చిన కొనుగోలుదారులతో రోడ్డుపై రాకపోకలు సాగించటం కష్టంగా మారుతుందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బావి రోడ్డులో ఏర్పాటు చేసిన బడ్డీ కొట్టు

**మురుగు కాలువలపై బడ్డీలు**

ఇక కొంతమందైతే ఏకంగా మురుగుకాలువలపైనే బడ్డీలు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో మురుగు కాలువలను శుభ్రం చేసే పరిస్థితి లేకపోవటం వల్ల దుర్వాసనతో పాటు దోమలు పెరిగిపోతున్నాయి. మురుగు కాలువలపై బడ్డీలు యథేచ్ఛగా ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవటం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక అయోధ్యనగర్ రాజరాజేశ్వరిపేట బుడమేరు కట్ట రోడ్డులో మెరక చేసి మరీ పసుపు బడ్డీలు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. అధికారులు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆక్రమణలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.



మధురానగర్ మసీదు సమీపంలో ఏర్పాటు చేసిన టిఫిన్ బండి

**ప్రమాదకరంగా మలుపులు**

రోడ్డు మలుపుల వద్ద ఆక్రమణదారులు బడ్డీలు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో మలుపులు తిరిగేటప్పుడు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక మహిళలు, చిన్నారులు మలుపుల వద్ద తరచూ జారి పడిపోతున్నారు. ముఖ్యంగా మధురానగర్ ఆర్‌యూబీ మసీదు సమీపంలోని మలుపు, రామాలయం సమీపంలోని మలుపుల వద్ద బడ్డీలు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగించటం వల్ల పక్క నుంచి ఎవరు వస్తున్నారో తెలియటం లేదు. వేగంగా వచ్చిన వాహన చోదకులు ఒక్కసారిగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ విజయలక్ష్మి

పాయకాపురం(విజయవాడరూరల్): స్వచ్ఛంద సేవా సంస్థలు వైద్యశిబిరాల ద్వారా అందజేస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ అలంపూర్ విజయలక్ష్మి అన్నారు. 62వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో అవోపా మహిళా విభాగం ఏపీ, కృష్ణా అవోపా మహిళా విభాగ్, విజయవాడ అవోపా వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం జరిగింది. వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ విజయలక్ష్మి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పేదలు నివసించే ఈ ప్రాంతాల్లో వైద్య నిపుణులు వైద్య శిబిరాలను నిర్వహించి ఉచితంగా వైద్య పరీక్షలు, ఉచితంగా మందులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం వైద్యులు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రామిరెడ్డి, హైమావతి, వైద్యులు శ్రీనివాసరావు, ప్రభాకర్ శాస్త్రి, చైతన్య, గిరిజా రాణి, టి.హరినాథ్, ఏపీ చైర్మన్ ఆరవేటి నిర్మల, అవోపా మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని ఇంగ్లిష్ అధ్యాపకుడు జె.దేవ్ అన్నారు. ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా స్పోకెన్ ఇంగ్లిష్‌పై ఆదివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇంగ్లిష్‌లో ఏయే సందర్భాలలో ఏయే పదాలు వినియోగించాలో వివరించారు. కొన్ని పదాలు ఎక్కడ వాడాలో తెలిపారు. స్పోకెన్ ఇంగ్లిష్‌లో గ్రామర్ 20 శాతం మాత్రమే ఉపయోగిస్తారన్నారు. ఇంగ్లిషు భాష వాడే తీరును సోదాహరణంగా వివరించారు. శ్రద్ధ పెడితే ఇంగ్లిష్ నేర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పిల్లలను చురుకైన పౌరులుగా మార్చే బాలల పార్లమెంట్

లబ్బీపేట(విజయవాడతూర్పు): బాలలను చురుకైన పౌరులుగా, నాయకులుగా మార్చటానికి బాలల పార్లమెంట్ దోహదం పడుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పటమటలోని ఎస్ఎస్ఎం స్కూలులో ఆదివారం గృహ కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో బాలల పార్లమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ఫీల్డ్ కో ఆర్డినేటర్ అంజనా టిర్కీ మాట్లాడుతూ.. తాము 211 గ్రూపులతో 42 మురికివాడల్లో పని చేస్తున్నామన్నారు. విజయవాడ నగర బాలల పార్లమెంట్‌లో 10 కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. బాలల పార్లమెంట్ అనే కార్యక్రమం ద్వారా సమ్మిళితమైన, సమానమైన సమాజాన్ని సృష్టించడానికి వివిధ మార్గాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కె.శ్వేత మాట్లాడుతూ.. నగర బాలల పార్లమెంట్ సామాజిక బాధ్యతాయుతమైన వ్యక్తులుగా ఎలా ప్రేరేపించిందో, వారికి ఎలా సహాయపడిందో వివరించారు. కార్యక్రమంలో పి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రామిక పక్షపాతి వుప్పల లక్ష్మణరావు

విజయవాడకల్చరల్: శ్రామిక పక్షపాతి డాక్టర్ వుప్పల లక్ష్మణరావు అని రచయిత్రి, అనువాదకురాలు ఓల్గా అన్నారు. సాహితీమిత్రులు ఆధ్వర్యంలో శిఖామణి సెంటర్‌లోని శిఖరా స్కూల్‌లో నవలా రచయిత, అనువాదకుడు, సంపాదకుడు లక్ష్మణరావు సాహిత్య రచనల గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఓల్గా వుప్పల సాహితీ ప్రస్థానంలోని అనేక విషయాలను వివరించారు. ఆయన రచించిన అతడు ఆమె నవల ద్వారా సాహితీ ప్రపంచంలో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్నారన్నారు. అతని రచనల్లో సామాజిక బతుకు కనిపిస్తోందని చెప్పారు. మాస్కోలోని ప్రగతి ప్రచురుణాలయం ద్వారా అనేక రచనలను తెలుగులోకి అనువాదించారని తెలిపారు. అతడు ఆమె నవల చదివిన తరువాత ఆమె – మనం పేరుతో పెద్ద వ్యాసం రచించిన సందర్భం గుర్తు చేసుకున్నారు. శ్రీశ్రీ ప్రింటర్స్‌ను విశ్వేశ్వరరావు ప్రారంభించాక ప్రచురించిన రెండో పుస్తకమేనన్నారు. తనను ప్రభావితం చేసిన అంశాలు వారిలో కనిపించాయని గుర్తు చేసుకున్నారు. కవి బండ్ల మాధవరావు మాట్లాడుతూ.. నవలా రచయితగా, అనువాదకునిగా తెలుగు సాహిత్యానికి సేవలను అందించారని తెలిపారు. బరంపురానికి చెందిన వికాసం సంస్థ ప్రతినిధులు ఎంపీ కామేశ్వరరావు, బి.రవిశర్మ, సేతుపతి ఆదినారాయణలు, చినుకు మాసపత్రిక సంపాదకుడు నండూరి రాజగోపాల్ వుప్పల ఆయన జన్మించిన బరంపురంతో అనుబంధం సాహిత్య జీవిత విశేషాలను వివరించారు.



లక్ష్మణరావు సాహిత్య పరిచయ సభలో మాట్లాడుతున్న రచయిత్రి ఓల్గా, రాజగోపాల్

## 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్లు మంజూరు చేయాలి

పాయకాపురం(విజయవాడరూరల్): కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం మేరకు 50 ఏళ్లు నిండిన వారికి కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక నాగుల్ మీరా డిమాండ్ చేశారు. 64వ డివిజన్ కండ్రిక కార్యాలయంలో ఆదివారం జరిగిన నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు గడుస్తున్నా కొత్త పింఛన్ల మంజూరు విషయం ప్రస్తావించడంలేదన్నారు. కూటమి ప్రభుత్వాన్ని గెలిపించిన ప్రజలు సంక్షేమ పథకాల కోసం సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారన్నారు. కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 64వ డివిజన్‌కు చెందిన మొహమ్మద్ జానీకి ఏఎంసీ డివిజన్ సహాయ కార్యదర్శిగా నియమించి నియామక పత్రం అందజేశారు. కమిటీలో సభ్యత్వం తీసుకున్న వారు యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలన్నారు. కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ, ఉపాధ్యక్షుడు నాగుల్ మీరా, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజా, నగర ప్రధాన కార్యదర్శి ఎండీ ఇస్మాయిల్, నగర అధ్యక్షుడు షేక్ నాగూర్ పాల్గొన్నారు.



జానీకి నియామక పత్రం అందజేస్తున్న ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా

## కష్టపడే వారికి వైఎస్సార్ సీపీలో ఎల్లప్పుడూ గుర్తింపు

**వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు**



విష్ణుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కష్టపడే వారికి పార్టీలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటోందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల పదవులు పొందిన వారి పరిచయ కార్యక్రమం సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి 9 నెలలైనా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమైందన్నారు. అతి తక్కువ కాలంలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను ఈ ప్రభుత్వం మూటకట్టుకుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు అండగా నిలబడాల్సిన సమయం వచ్చిందని.. అందరూ ఐక్యంగా ఉంటూ ప్రభుత్వ తప్పులను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడే ఏ పథకం ఏ నెలలో ఇస్తామో ముందుగానే బడ్జెట్‌తో పాటు సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేసిన ఘనత గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదని.. కానీ కూటమి ప్రభుత్వం బడ్జెట్‌ను అంకెల గారడీగా మార్చేసిందని ఎద్దేవా చేశారు. అన్ని వర్గాల ప్రజలు ఈ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని.. మన ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

**రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం భ్రష్టు పట్టించింది**

మహిళల భద్రతను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని.. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని మాజీ ఎమ్మెల్యే విష్ణు మండిపడ్డారు. మరోవైపు వ్యవస్థలన్నీ పూర్తిగా నీరుగారిపోతున్నాయని.. వ్యవసాయ రంగం పూర్తిగా కుదేలైందన్నారు. వైద్యరంగం పరిస్థితి కూడా దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవటంతో సర్టిఫికెట్స్ రాక ఎందరో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని.. వారి తరఫున పోరాటం చేయవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. అలాగే రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీ శైలజ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని, ఇటువంటి తరుణంలో ప్రజల తరఫున గళం వినిపించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అనంతరం పదవులు స్వీకరించిన నాయకులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో వివిధ విభాగాలలో పదవీ బాధ్యతలు అప్పగించినందుకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, మల్లాది విష్ణుకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు అప్పజెప్పిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామని రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ శర్వాణిమూర్తి, నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుర్గంధం.. దోమల సమస్యను నివారించండి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన చెత్త వలన పరిసర ప్రాంతాలన్నీ దుర్గంధానికి నిలయంగా మారటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే సమస్యను నివారించాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులతో కలిసి సింగ్‌నగర్ డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఇదే ఇబ్బందులు ఎదుర్కొన్న సింగ్‌నగర్ కోసం సీపీఐ చేసిన పోరాట ఫలితంగా నాటి మున్సిపల్ కమిషనర్ దుర్గంధం లేకుండా ఏరోజు వచ్చిన చెత్తని ఆ రోజు ఇక్కడ నుంచి తరలిస్తామని చెప్పి, తొలగించారన్నారు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు తొలగి ఊపిరి పీల్చుకున్నారని చెప్పారు. మరలా గత 40 రోజులుగా చెత్త తరలింపు సక్రమంగా జరగకపోవడంతో, చెత్తకు పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తోందని, ఫలితంగా దోమలు పెరిగి ప్రజలపై దాడి చేస్తున్నాయని ఆరోపించారు. తక్షణమే ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు నగరపాలక సంస్థ కమిషనర్, అధికారులు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు కేవీ భాస్కరరావు, కార్యవర్గ సభ్యులు లింగబత్తుల శివకుమార్, నాయకులు కంది ఆదినారాయణ, పాపారావు, లక్ష్మయ్య, టి.బ్రహ్మాజీ, సంపత్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

## విద్యార్థులకు మనోధైర్యాన్ని అందించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ తరం విద్యార్థులు అపజయాన్ని అంగీకరించకుండా మానసిక స్థైర్యాన్ని కోల్పోతున్నారని, వారిలో మనోధైర్యాన్ని నింపే చర్యలు అత్యవసరమని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు అన్నారు. అందుకోసం దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో కెరీర్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్లను నియమించామన్నారు. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో ఆదివారం ఇండ్లాస్ చైల్డ్ గైడెన్స్ క్లినిక్ 10వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ.. క్రీడలతో కూడిన పాఠ్య ప్రణాళిక అవసరమన్నారు. అనంతరం డాక్టర్ ఇండ్ల విశాల్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల గల పిల్లలకు సైకియాట్రిక్ ఎవల్యేషన్ ఫిజియోథెరపీ కౌన్సెలింగ్, స్పీచ్ థెరపీ, హోట్ బేస్డ్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్, బిహేవియర్ థెరపీ వంటి సౌకర్యాలు ఐసీజీసీ అందిస్తోందని చెప్పారు. విజయవాడలో తొలిసారిగా దివ్యాంగ పిల్లల కోసం ఏర్పాటు చేసిన హాస్పిటల్ ఐసీజీసీ అన్నారు. ఈ సందర్భంగా ఐసీజీసీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇండ్లాస్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ బి.హనుమయ్య, కార్యదర్శి వి.సురేష్‌కుమార్, డాక్టర్ మంజీరీదేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.



ఐసీజీసీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు, వైద్యులు ఇండ్ల రామసుబ్బారెడ్డి, విశాల్ తదితరులు

## నెలవంక.. కనువిందు



నగరంలో రంజాన్ ఉపవాస ప్రార్థనలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆకాశంలో కనిపించిన నెలవంకను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

## శివాలయం రోడ్డులో డంపర్ బిన్ తొలగింపు

**సాక్షి ఎఫెక్ట్**

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎట్టకేలకు వీఎంసీ అధికారులు స్పందించారు. మధురానగర్ శివాలయం రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన డంపర్‌బిన్‌ను తొలగించారు. ఇక్కడ రోడ్డు మధ్యలో డంపర్ బిన్‌ను ఏర్పాటు చేయటం వల్ల భక్తులు, స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ సహనాన్ని పరీక్షిస్తున్న డంపర్ బిన్ శీర్షికన సాక్షి దిన పత్రికలో కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు డంపర్ బిన్‌ను తొలగించి పరిసరాలు శుభ్రం చేశారు.

## సండే ఫుల్ రష్



వినియోగదారులతో కిటకిటలాడుతున్న విశాలాంధ్ర రోడ్డు

నగరంలోని నాన్ వెజ్ మార్కెట్‌లు ఆదివారం కావడంతో కిటకిటలాడాయి. విశాలాంధ్ర రోడ్డుతో పాటు బుడమేరు వంతెన వద్ద మటన్, చేపల విక్రయాలు జోరుగా జరిగాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



బుడమేరు వంతెన వద్ద విక్రయానికి ఉంచిన చేపలు